క్లుప్తంగా

నేడు పుస్తకావిష్కరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని వందమంది కవులు రాసిన ఐదొందల మొగ్గలు పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియం ఆడిటోరియంలో ఉంటుందని పాలమూరు సాహితీ అధ్యక్షుడు, మొగ్గలు ప్రక్రియ రూపకర్త డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త, ఆంధ్రప్రదేశ్ జానపద అకాడమీ, అధికారభాషా సంఘం మాజీ చైర్మన్ పాట్లూరి హరికృష్ణ సంపాదకత్వంలో వందకవులు–ఐదొందల మొగ్గలు పుస్తకం రూపొందిందని తెలిపారు. కార్యక్రమానికి సాహిత్య మిత్రులందరూ హాజరుకావాలని కోరారు.

యూరియా పక్కదారి పట్టిస్తే చర్యలు



నవాబుపేట: యూరియా పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఎరువుల విక్రయ కేంద్రాన్ని మండల అధికారులు, పోలీసులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా కృత్రిమ కొరత సృష్టించిన, పక్కాదారి పట్టించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల కేంద్రంలో ఒక దుకాణంలో రాత్రివే యూరియా తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో వాటిని తనిఖీ చేసి రైతులవని గుర్తించినట్లు తెలిపారు. కాగా రైతులైనా యూరియాను ఇష్టానుసారంగా తీసుకుని పక్కాదారి పట్టిస్తే చర్యలు తప్పవన్నారు. కాగా ప్రైవేట్ దుకాణాల్లో ఎరువులు, ఇతర రసాయనిక ఎరువులపై పూర్తి సమాచారం బోర్డులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఏఓ కృష్ణకిశోర్, ఎస్ఐ విక్రమ్, ఆర్ఐ గాయిత్రీ తదితరులు ఉన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన

నవాబుపేట: ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ముసాయిదా జాబితా అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. శనివారం జాబితాను ఎంపీటీసీల స్థానాలవారీగా ప్రకటించామని వాటిపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 8వ తేదీవరకు మండల అధికారులకు వివరించాలని సూచించారు. దీంతోపాటు ఓటర్ల జాబితా సైతం ప్రకటించామని తెలిపారు. వీటిపై ఈనెల 8న అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి 10వ తేదీన తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు.

చలో కలెక్టరేట్‌కు తరలిరావాలి

నవాబుపేట: దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలని, ఇతర పింఛన్లు కూడా రూ.4వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనను విజయవంతం చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం ఇస్తామన్న పెంచిన పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్త పింఛన్లు సైతం వెంటనే అందించాలని కోరారు. ఈ విషయంలో వికాలాంగుల సంఘం ఆధ్వర్యంలో మందకృష్ణ పిలుపుమేరకు ఈనెల 8న చేపట్టిన చలో కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశలో సంఘం నాయకులు నరేందర్, జైపాల్‌రెడ్డి, వెంకటయ్య, వీరేశ్, నర్సింహ, సాబేరా, రాజయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

రేపు రాజకీయ పార్టీల సమావేశం

జడ్చర్ల టౌన్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల జాబితాలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి అన్నిపార్టీల ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

బాదేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్‌జీఎఫ్ టోర్నీ

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మండల రూరల్ అండర్–14, 17 బాల బాలికల కబడ్డీ, ఖోఖో వాలీబాల్ గేమ్స్ టోర్నమెంట్, ఎంపిక బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఆలూరు జెడ్పీహైస్కూల్‌లో వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు సమావేశమై పైనిర్ణయం తీసుకున్నారు. గేమ్స్ నిర్వహణ ఆర్గనైజింగ్ సెక్రటరిగా మండల సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సోమ్లనాయక్‌ను ఎన్నుకున్నారు. ఈనెల 12న టోర్నీ, ఎంపిక చేయాలని నిర్ణయించారు. అలాగే పదోన్నతి పొంది నసురుల్లాబాద్‌కు పీడీగా వచ్చిన పరమేశ్వరిని ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఆలూరు హెచ్‌ఎం షరీఫ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదభాయి, తెలంగాణ రాష్ట్ర పీడీ, పీఈటీ సంఘం అధ్యక్షుడు నిరంజన్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



ఆరుబయట వంట.. ఎన్నాళ్లీ తంటా



మహమ్మదాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో కట్టెలపొయ్యిపై వంటలు చేస్తున్న మహిళలు

- మధ్యాహ్న భోజనం వండేందుకు మహిళల అవస్థలు
- కట్టెల పొయ్యితో వంటలు చేయలేమంటున్న కార్మికులు
- తడిసిన కట్టెలతో పాడుబడిన ఇరుకు గదుల్లో వంటలు
- పాఠశాలల్లో కిచెన్‌షెడ్లు లేక వంటకు తంటాలు

మహమ్మదాబాద్: వంటచెరుకును వాడకుండా మహిళ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు గ్యాస్ పొయ్యిలపై వంట చేసే నేటిరోజుల్లో.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వండే మహిళలు కట్టెల పొయ్యి వాడుతూ.. ఎన్నో అవస్థలు పడుతున్నారు. నిత్యం కళ్లమండుతూ అనార్యోగ్యాల పాలవుతున్నారు. మండల వ్యాప్తంగా 5ఉన్నత, 5ప్రాథమికోన్నత, 33ప్రాథమిక పాఠశాలలు ఉండగా.. వాటిలో మొత్తం 1,063మంది విద్యార్థులున్నారు. నిత్యం వండి వడ్డించే మధ్యాహ్న భోజనానికి ఆయా పాఠశాలల్లో కిచెన్ షెడ్డులు లేక వంట మహిళలు ఇక్కట్లకు గురవుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో తడిసిన కట్టెలతో వంటలు చేయలేక, చేసినా.. అన్నం కూడా సరిగ్గా ఉడకడం లేదు. కొన్ని పాఠశాలల్లో వంటషెడ్లు ఉన్నా.. కట్టెలు తడిసిపోవడంతో వంట ప్రారంభించాలంటేనే భయం వేస్తుందని.. పొగతో కంటిచూపు కూడా తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంటగ్యాస్ సరఫరాలో నిర్లక్ష్యం

ఎన్నో ఏళ్లుగా కట్టెలతోనే వంటలు చేస్తున్న మహిళలు అనారోగ్యం పాలవుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. గురుకుల పాఠశాలల్లో వంటగ్యాస్‌తోపాటు అన్ని సౌకర్యాలు కల్పించి పాఠశాలల్లో మాత్రం పట్టించుకున్న పాపానపోలేదు. విద్యార్థుల కు మధ్యాహ్న భోజనం వండి వడ్డించేందుకు కిచెన్ షెడ్లతోపాటు గ్యాస్ సరఫరా చేయాలని ఆయా పాఠశాలల వంటమహిళలు డిమాండ్ చేస్తున్నారు. పలుమార్లు అధికారులు, హెచ్‌ఎంలకు సమాచారం ఇచ్చినా.. ఫలితం లేకుండా పోయిందని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వంటలు చేయడానికి ఓవైపు షెడ్లు లేక మరోవైపు ఇరుకు గదుల్లో కట్టెలతో వంటలు చేయలేక పొగతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

గ్యాస్ కనెక్షన్లు తీసుకోవాలి

మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో వంట చేసేందుకు గ్యాస్ కనెక్షన్లు తీసుకోవాలని ఇటీవల వంటల ఏజెన్సీలకు తెలిపాం. వంట చెరుకుతో ఇబ్బందులు పడుతున్న మహిళలు వెంటనే గతంలో ఇచ్చిన గ్యాస్ కనెక్షన్లు పునరుద్ధరించుకోవాలి. అన్ని పాఠశాల్లో వంటషెడ్లను నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

– రాజునాయక్, ఎంఈఓ, మహమ్మదాబాద్

వంట గదిలేక పొగబాధ



మహమ్మదాబాద్ బాలుర పాఠశాలలో దాదాపు 400 మంది పిల్లలుంటారు. వారికి మంచి భోజనం వండి వడ్డించాలంటే విశాలమైన వంటగది ఉండాలి. ఇక్కడ వంటగది లేక తడిసిన కట్టెలతో నిత్యం పొగతో కళ్లు పాడవుతున్నాయి. ఒక్కోసారి గాలికి అన్నం సరిగ్గా ఉడకడం లేదు. వంట గది లేకపోవడంతో రేకుల చాటున వర్షానికి తడుస్తూ ఎంతో బాధ అనుభవిస్తూ.. ఏడుస్తూ తూడుస్తూ వంట చేస్తున్నాం.

– గూళ్ల రాములమ్మ, వంట కార్మికురాలు, మహమ్మదాబాద్

సిలిండర్లు ఇస్తే బాగుంటది



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భోజనం వండాలంటే తగిన సౌకర్యాలు లేక నిత్యం అవస్థలు పడుతున్నాం. కట్టెలు లభించక.. ఉన్నవాటితో కట్టెల పొయ్యిపై వంటలు చేయలేక పోతున్నాం. ప్రభుత్వం నుంచి ప్రతి పాఠశాలకు వంటగ్యాస్ సరఫరా చేస్తే బాగుంటది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడంతోపాటు వంట మహిళల ఆరోగ్యం కాపాడుకునే వీలు ఉంటుంది.

– నాగమణి, వంటకార్మికురాలు, నంచర్ల

మడుగుదాటి వెళ్లేదెలా?



అడ్డాకుల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పక్కన మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లే దారిలో వర్షం నీళ్లు మడుగులా నిలిచాయి. ఇక్కడ ఇటీవల కొత్తగా సీసీరోడ్డు వేశారు. రోడ్డును కాస్త ఎత్తుగా వేయడంతో నీళ్లు నిలుస్తున్నాయి. తహసీల్దార్, ఎంపీడీఓ, పీహెచ్‌సీ, పశువైద్య కేంద్రం, సింగిల్‌విండో కార్యాలయానికి ఇ దే దారిలో వెళ్లాలి. ఇక్కడ నీళ్లు నిల్వడంతో విధి లేని పరిస్థితిలో అందులోంచే వెళ్తున్నారు. మండలానికి చెందిన ప్రధాన అధికారులు ఇదేదారిలో నిత్యం వెళ్తున్నా ఇక్కడ నీళ్ల నిలవడంపై మాత్రం ఫోకస్ చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. సీసీరోడ్డు వేసేటప్పుడే నీళ్లు నిల్వకుండా చర్యలు చేపట్టాల్సింది. కాని ముందుచూపుతో ఆలోచన చేయకపోవడంతో సమస్య తలెత్తింది.అధికారులు తమ వాహనాల్లో కార్యాలయం వరకు వెళ్తున్నారు.. కాని నడిచి వెళ్లే సామాన్యుల పరిస్థితి ఏంటనేది ఒక్కరూ కూడా పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ, మండలంలో ప్రతిష్ఠించిన వినాయకుల నిమజ్జనం శనివారం ఉదయం వరకు కొనసాగి ప్రశాంతంగా ముగిసింది. మున్సిపాలిటీలోని నాగసాల చెరువు వద్ద 200 పెద్ద విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు పుర అధికారులు తెలియజేశారు. శనివారం ఉదయం నిమజ్జనం కోసం విగ్రహాలతో ఉన్న వాహనాలు బారులు తీరాయి. చిన్న విగ్రహాలు 100కుపైగా నిమజ్జనం జరిగినట్లు వెల్లడించారు. శుక్రవారం ప్రారంభమైన నిమజ్జన వేడుకలు రాత్రంతా కొనసాగుతూ.. శనివారం ఉదయం వరకు ముగిశాయి. మున్సిపల్ కమీషనర్ లక్ష్మారెడ్డి, సీఐలు కమలాకర్, నాగార్జునగౌడ్ పర్యవేక్షణలో నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. నిమజ్జనానికి సహకరించిన వారికి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అఖిల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వినాయక శోభాయాత్ర సందర్భంగా ఒకటిరెండు ఘర్షణలు చోటుచేసుకోగా.. అప్పుడే సద్దుమనిగాయి. రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందడం విషాదంగా మారింది.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో కళా సిల్క్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేనేత హస్తకళ ప్రదర్శన వినియోగదారుల నుంచి విశేషంగా ఆకట్టుకుంటోంది. చేనేత, హస్తకళ ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. వివిధ రాష్ట్రాల చేనేత కళాకారులు అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణలోని గద్వాల, నారాయణపేట, పోచంపల్లి, ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడ, అస్సాంలోని మూగ, ఎరిశిల్క్స్, బీహార్‌లోని బాగల్పూర శిల్క్స్, టస్సర్, చత్తీస్‌ఘడ్‌లోని ట్రిబిల్ వర్క్స్, కోసా శిల్క్, గుజరాత్‌లోని బాందని, కచ్చ ఎంబ్రాయిడరీ డ్రెస్, శారీస్, జమ్మూ కాశ్మీర్‌లోని ఎంబ్రాయిడరీ శారీలు, డ్రెస్ మెటీరియల్స్, పాస్మిక్ శాల్, కర్ణాటకలోని క్రేస్, ప్రింటెండ్ శారీస్, మధ్యప్రదేశ్‌లోని చందేరి, మహేశ్వరి, రాజస్తాన్‌లోని కోటా, బందాని, బ్లాక్ ప్రింట్, సంగ్నరి ప్రింట్, ఉత్తరప్రదేశ్‌లోని జమ్దానీ, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్ తోపాటు హర్యానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నోవి కుర్తీస్, డోర్ కర్టెన్స్ తదితర రాష్ట్రాల హ్యాండీ క్రాఫ్ట్స్, న్యూట్రిషన్ ఫుడ్ విక్రయిస్తున్నారు.

వైభవంగా ఆంజనేయ, ఈశ్వర, వెంకటేశ్వర ఉత్సవాలు



చిన్నచింతకుంట: మండలం లాల్‌కోటలో కొలువుదీరిన ఆంజనేయ, ఈశ్వర, వేంకటేశ్వరస్వామివార్ల ఉత్సవాలు మూడురోజులపాటు అంగరంగ వైభవంగా కొనసాగనున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామస్తులు ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ సదర్భంగా గ్రామంలోని సింగిల్‌విండో కార్యాలయం లాకర్‌లో భద్రపరిచిన స్వాములవారి వెండి ఆభరణాలను ఆలయాల కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ముగ్గురు స్వాములకు అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం చంద్రగ్రహనం కారణంగా ఉత్సవాలను నిలిపి వేయనున్నారు. సోమ, మంగళవారాల్లో కొనసాగిస్తారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పాలమూరు: జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ నూతన అసోసియేషన్‌కు శనివారం పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఆరుగురు ప్రత్యేక ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పుల్లా శ్రీనివాస్ కార్యవర్గం, ప్రశాంత్ కార్యవర్గం పోటీపడ్డాయి. జిల్లా అధ్యక్షుడిగా ప్రశాంత్ ఎన్నికయ్యారు.

వినాయకా.. వీడ్కోలిక



నవాబుపేట, చౌడూర్, మరికల్‌లో నిమజ్జనానికి తరులుతున్న గణనాథులు, ఆకట్టుకున్న ఊరేగింపులు

- ఆకట్టుకున్న శోభాయాత్ర
- మేళతాళాలు, కోలాటంతో మహిళల ఉత్సాహం
- డీజే పాటలకు యువకులు, చిన్నారుల చిందులు

నవాబుపేట: నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. శనివారం వైభవంగా నిమజ్జనానికి వెళ్లాడు. మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన గణనాథులు మేళతాళాలు, భజనలు, మహిళల కోలాటాలతో ఊరేగింపులుగా శోభయాత్ర వైభవంగా సాగింది. ప్రధానంగా శివాలయం, హనుమాన్ ఆలయం, కన్యకాపరమేశ్వరీ ఆలయం, రవీంద్ర యువజన సంఘం, ఏకలవ్య, జైగణేశ్ యువజన సంఘాల గణపతులు ప్రత్యేక ఆకర్శణతో నిలిచాయి. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. అధికారులు,ప్రజాప్రతినిధులు వినాయకులకు పూలమాలలు వేసి నిమజ్జనానికి స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాచారి, లక్ష్మయ్య, సుధాకర్‌చారి, శరత్కృష్ణ, అంజయ్య, శివకుమార్, సుధాకర్‌జీ, రఘు, శ్రీనివాస్, రామకృష్ణ, సత్యం, రాజేశ్, ఆనంద్, నర్సింహ, రాజు, శ్రీరాములు, వాసు, అంజి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శోభాయాత్ర

మహమ్మదాబాద్: తొమ్మిది రోజులుగా వినాయక విగ్రహాలను భక్తిశ్రద్ధలతో పూజలు చేసి శనివారం నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా మహమ్మదాబాద్, నంచర్ల, గాధి ర్యాల్, జూలపల్లి, మొకర్లాబాద్ అన్ని గ్రామాల్లో చివరిరోజు వినాయక నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువతీ, యువకులు ఆటాపాటలతో డీజే నృత్యాలతో ఆకట్టుకుంటూ గణపయ్యను సాగనంపారు. ఈ సందర్భంగా వినాయక లడ్డులు, ఇతర సామగ్రి వేలంపాటలో దక్కించుకున్నారు.



మహమ్మదాబాద్‌లో గణనాథుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భగత్‌సింగ్ యూత్



నవాబుపేటలో మహిళల కోలాటం, నృత్యాలు



నిమజ్జనంలో ఆకట్టుకున్న అడుగుల భజన

మహబూబ్ నగర్ ఫస్ట్‌లో ఉపాధ్యాయ దినోత్సవం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బీకేరెడ్డి కాలనీలోని మహబూబ్ నగర్ ఫస్ట్ – నవరత్నాలు శిక్షణ కేంద్రంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శిక్షకులను సన్మానించారు. కార్యక్రమంలో కేంద్రం పర్యవేక్షకులు గుండా మనోహర్, ఇన్‌చార్జ్ నిజలింగప్ప, శిక్షకులు గౌతమి, కవిత, అనూష, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శిక్షణ కేంద్రం నిర్వాహకులు

ఉత్తమ సేవలకు రాష్ట్రస్థాయి పురస్కారం



మిడ్జిల్ ఎమ్మార్సీలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు



రాజాపూర్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ సుధాకర్

మెట్టుగడ్డ: విద్యారంగంలో ఉత్తమ బోధనలు, సీనియర్ సిటిజన్ ఫోరం ద్వారా సామాజిక కార్యక్రమాలు, విస్తృత సమాజ సేవల ద్వారా చైతన్యపరిచినందుకు జిల్లాకేంద్రానికి చెందిన డైట్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు శివన్నకు రాష్ట్రస్థాయి ప్రశంసలు లభించాయి. ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాద్‌లోని వైఎంఐఎస్ ఆడిటోరియంలో భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురువందన ఛాత్ర అభినందన కార్యక్రమంలో ఆయనకు ఉత్తమ అధ్యాపకుడిగా ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో పిల్లలు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై గౌరవభావంతో మెలగాలని, వివిధ విద్యారంగంలో అసాధారణ ప్రతిభ కనబరిచి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని, పలువురుకి ఇతోధికంగా సాయం చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు నాగేశ్వర్‌గుప్తా, కార్యదర్శి శివరామకృష్ణ, నర్సింహాచార్యులు, మాధవీలత, జోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

అవార్డులతో మరింత బాధ్యత

రాజాపూర్: తాము చేస్తున్న విధులను నిస్వార్థంగా నిర్వహిస్తున్నప్పుడు గుర్తించి ఇచ్చే అవార్డులు తమ బాధ్యతలను మరింత పెంచుతా యని ఎంఈఓ సుధాకర్ పేర్కొన్నారు. శనివా రం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని పలు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 30మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోజెస్, కేశవులు, రేణుక, సరస్వతి, సుమలత, శిల్ప, విజయలక్ష్మి, కృష్ణయ్య, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డుగ్రహీతలకు సన్మానం

మిడ్జిల్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గ్రామస్తులు ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియడారు. అనంతరం ఎమ్మార్సీలో మండలంలో ఎంపికైన పది మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి, ఎంఈఓ వెంకటయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

గండేడ్: సమసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకమని ఎంఈఓ జనార్దన్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్, శాంతయ్య, కృష్ణారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రం అందుకున్న శివన్నతో భారత్ వికాస్ పరిషత్ సభ్యులు



మిడ్జిల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు



గండేడ్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

50శాతం మంది ఉపాధ్యాయుల సెలవు

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో దాదాపు 384 మంది విద్యార్థులు 13 తరగతుల్లో విద్యాబోధన కొనసాగుతుంది. శనివారం పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల్లో దాదాపు 50శాతం మంది ఉపాధ్యాయులు ఏకంగా 10మంది సెలవు పెట్టారు. ఉన్న వారితో విద్యాబోధన కొనసాగించారు. జీహెచ్‌ఎంతో సహా ఏకంగా పదిమంది విధులకు గైర్హాజరయ్యారు. హాజరైన వారిలో ఒకరు పీఈటీ, మరొకరు రికార్డు అసిస్టెంట్ ఉన్నారు. నిబంధనల ప్రకారం ఉన్న సిబ్బందిలో మూడోవంతు మాత్రమే సెలవు పెట్టుకోవచ్చు. అంటే ఏడుగురికి మాత్రమే సెలవు వస్తుంది. కాని 10మంది రాలేదు. ఇలాగైతే విద్యబోధన ఎలా కొనసాగుతుందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై జీహెచ్‌ఎం సరస్వతిని వివరణ కోరగా.. నా అనుమతి లేకుండా సెలవు పెట్టారు. వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించండి

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామంలో శనివారం ఎస్ కె ఎం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి రాము మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలు పత్తి, ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విదేశాల నుంచి పత్తి పంటను దిగుమతి చేయడం ద్వారా భారతదేశంలో పత్తి పంట పండించే రైతులు గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్నారని వాపోయారు.పత్తి దిగుమతులపై కేంద్రం ప్రభుత్వం ఏదైతే సుంకాలు ఎత్తివేసిందో ఆ సుంకాలను యధావిధిగా కొనసాగించి రైతు లకు మద్దతు ధర కల్పించాలన్నారు.

బుచ్చారెడ్డికి నివాళి

రాజాపూర్: ముదిరెడ్డిపల్లికి బుచ్చారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు బచ్చిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ముదిరెడ్డిపల్లిలో దివంగత సర్పంచ్ బుచ్చారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శేఖర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.